

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 7 జూన్ 2025





# వీడని 'డీఎస్ఆర్' పంచాయితీ

- యాప్‌ను బహిష్కరించిన కార్యదర్శులు
- రెండు వారాలుగా అటెండెన్స్ వేయని తీరు
- ఉదయం హాజరుపై తీవ్ర వ్యతిరేకత
- షోకాజ్ నోటీసులు ఇచ్చే యోచనలో ఉన్నతాధికారులు..
- జిల్లాలో 236 మంది కార్యదర్శులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల )

గ్రామపంచాయతీలో పారదర్శకతపాలను పెంపొందించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల యాప్‌లు, పోర్టల్లు తీసుకొస్తు న్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తెచ్చిన డైలీ శానిటేషన్ రిపోర్ట్(డీఎస్ఆర్)యాప్ పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వానికి మధ్య వివాదాన్ని సృష్టించింది. పంచాయతీల్లో మెరుగైన పాలన కోసం తెచ్చిన కొత్త విధానం డీఆర్ఎస్ యాప్‌లో ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి 8 గంటలలోపే అటెండెన్స్‌తో వేయాలి. దీంతోపాటు గ్రామపంచాయతీలో జరిగే శానిటేషన్ ఇతర పనులకు సంబంధించిన ప్రక్రియ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఒత్తిడికి గురవుతున్న కార్యదర్శులకు కొత్తగా వచ్చిన డీఎస్ఆర్ యాప్ మరింత ఇబ్బందికరంగా మారడంతో దాన్ని వ్యతిరేకిస్తూ రెండు వారాలుగా యాప్ ద్వారా అటెండెన్స్ వేయడం లేదు. యాప్‌ను రద్దు చేయాలని కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

### జిల్లాలో 260 గ్రామాలు...

రాజన్న సిరిసిల్ల జిల్లా 260 గ్రామపంచాయతీలు ఉండగా, 236 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న కార్యదర్శుల ఆందోళనలో భాగంగా జిల్లా కార్యదర్శులు కూడా అదేబాటలో కొనసాగుతున్నారు. అటెండెన్స్ వేయకుండా వ్యతిరేకతను తెలుపుతున్నారు. యాప్‌లో అటెండెన్స్‌తోపాటు ఇతర వివరాలు ఫొటోలు కూడా అప్‌లోడ్ చేయవద్దని తీర్మానించారు. గ్రామ కార్యదర్శి యాప్ ద్వారా హాజరు నమోదు కాకుంటే సీఎల్‌గా పరిగణించాలని పంచాయతీరాజ్ డైరెక్టర్ ఆదేశాలు కూడా ఇచ్చారు. దీంతో పాటు షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వాలని భావిస్తున్నారు. ఇదే కొనసాగితే కార్యదర్శులు మూకుమ్మడిగా సెలవుల్లోకి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. గ్రామపంచాయతీలో పారదర్శకత పెంచే దిశగా తెచ్చిన డైలీ శానిటేషన్ రిపోర్ట్ యాప్‌లో ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్య కార్యదర్శి పంచాయతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ నుంచి ఫ్లేస్ రికగ్నైజేషన్, లైవ్ లోకేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి. తరువాత పంచాయతీ కార్యాలయం లోపల బయట ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఎనిమిది గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా హాజరుపడదు. గ్రామంలోని పారిశుధ్యం తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, స్కూళ్లలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి వాటి ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. ఇంటింటికి వెళ్లి తీసుకువచ్చే తడి, పొడి చెత్త వేరు చేయించి వాటిని తూకం వేయించాలి. ఈ సమాచారాన్ని కూడా యాప్‌లో పొందపరచాలి. పల్లె ప్రగతి పనులతో పాటు విద్యుత్ బిల్లులు, బర్త్, డెత్ వివరాలను నమోదు చేయాలి. ఇందులో ప్రధానంగా గ్రామ కార్యదర్శులు ఉదయం హాజరు నమోదు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

### కుంటుపడనున్న పంచాయతీ పాలన..

జిల్లాలోని 260 గ్రామపంచాయతీలో పాలకవర్గాలు లేక పంచాయతీ కార్యదర్శుల ద్వారానే పారిశుధ్యం, ఇతర కార్యక్రమాలు నిర్వహణ కొనసాగుతోంది. పంచాయతీలో నిధులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్న గ్రామాల్లో కొంతమేరకైనా పనులు చేయిస్తున్నారు. గ్రామాల్లో నిధుల ఇబ్బందితో కనీసం పెట్రోల్ బంకుల్లో డీజిల్ కూడా గ్రామపంచాయతీ ట్రాక్టర్లలో పోయించలేని... మిగతా 8లో



విచారణ కార్యాలయం వద్ద భక్తులు..

## రూములు లేవు..

- వేములవాడలో గదులు లభించక భక్తుల ఇబ్బందులు
- నందీశ్వర కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్నా లేవని చెబుతున్న ఉద్యోగులు

7

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇల్లు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ..
- వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8


చింతలఠాణ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

## ఆదాయ వనరుగానే రాజన్న కోడెలు..

**- బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ**


తిప్పాపూర్ గోశాలలో కోడెలను పరిశీలిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రంలోని కోడెలను ఆదాయ వనరుగానే భావిస్తున్నారని, కోడెల సంరక్షణను దేవాదాయ శాఖ గాలికి వదిలేసిందని బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలను శుక్రవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కోట్లల్లో ఆదాయం వస్తున్న కోడెల సంరక్షణపై పట్టింపు లేకపోవడం బాధాకరం అని అన్నారు. గోశాలలోని కోడెల పరిస్థితిని చూస్తే గుండెలు కలిచి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం కోడెల హెల్త్ బులెటిన్‌ను అధికారులు విడుదల చేస్తున్నారని, దానితో ఒరిగేది ఏమిలేదని, ఇప్పటి వరకు ఎన్ని కోడెలను సంరక్షించారు... మిగిలిన కోడెలు వైద్యం అందించినప్పటికి ఎందుకు మృత్యువాత పడుతున్నాయని ప్రశ్నించారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న పండితులు

సిరిసిల్ల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శ్రీఅనంతలక్ష్మీవీర వెంకట సత్యనారాయణ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం కన్నుల పండువగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున ద్వారతోరణ పూజ, ధ్వజకుంభ, చతుస్థానార్చన, మంటపారాధన, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమాలతోపాటు మహాపూర్ణాహూతి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం 9.45 గంటలకు అనంత లక్ష్మీ వీరవెంకటసత్యనారాయణస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ ఆవరణంలోనే సత్యనారాయణ స్వామి వ్రతాలను చేపట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు సంగీతం శ్రీనివాస్, పట్టణ కమిటీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్యలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాచవిద్యాసాగర్ గురుస్వామి, ఆలయ కమిటి సభ్యులు దుబ్బ విశ్వనాథం, ప్రయాకర్‌రావు మధుసూధన్, గడ్డం భగవాన్, బండారి మల్లేశం, మచ్చ శ్రీనివాస్, చేపూరి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# 19 వరకు బడిబాట కార్యక్రమాల నిర్వహణ


కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఈనెల 19వ తేదీవరకు ప్రభుత్వ ఉపాధ్యాయులు స్థానిక నాయకులతో కలిసి బడిబాట కార్యక్రమాలను నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలందరు అడ్మిషన్‌లు పొందేలా ప్రత్యేకమైన దృష్టి సారించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న బాలబాలికలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాల్లో భాగంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, ఏఎన్ఎంలు,వీవోలు కలిసి ఒక టీంగా ఏర్పడి ప్రతిఇంటికి వెళ్లి పిల్లలందరిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బాలికలను చేర్పించే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ నూతన ఉపాధ్యాయుల ద్వారా అందిస్తున్న మెరుగైన నాణ్యమైన విద్యాబోధన, వసతులు, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్నభోజనం, వివిధ పోటీ పరీక్షలు, జేఈఈ, నీట్ ఎంట్రన్స్ పరీక్షల కోచింగ్, డిజిటల్ క్లాస్‌రూంలు తరగతి గదులు విశాలమైన క్రీడా మైదానాలపై ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలు ఎక్కడ డ్రాప్ అవుట్ కాకుండా చూడాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం బడిబాట కార్యక్రమాల్లో పాల్గొంటూ బాలికలు ఎక్కడ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు విద్య పట్ల ప్రభుత్వం పాఠశాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. పదవ తరగతి ముగిసిన త్వరాత ఇంటర్మీడియేట్ చదివేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి మండల పరిధిలో సూపర్‌వైజర్ వారి పరిధిలో గల బాలికలపై శ్రద్ధ వహిస్తూ వారు చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు, పట్టణాలల్లో వార్డు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ బాలకార్మికులు తప్పకుండా చర్యలు తీసుకోవాలని పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలలో నమోదు కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, హోటల్స్, ఇటుక బట్టీలను తనిఖీ చేసి ఎవరైనా బాలకార్మికులు కనిపిస్తే వారిని వెంటనే పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. వలస కూలీల పిల్లలు సైతం పాఠశాలలో నమోదు అయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ కూలీల కింద నమోదైన జాబ్‌కార్డులు కలిగిన ప్రతి కుటుంబంలో పిల్లలు చదువుకుంటున్నారో లేదో పరిశీలించాలన్నారు. పిల్లలు చదువుకోని పక్షంలో వెంటనే వారిని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన**


పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయడం ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో కోటి 43 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న 30పడకల ఆసుపత్రి పనులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుందని అన్నారు. వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, అందుకోసం ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. ఆనాడు రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయాలని ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేస్తే, ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచారన్నారు. వైద్యపరంగా పేదలకు మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రుద్రంగి మండల కేంద్రానికి రూ.42 కోట్లతో ఏటీసీ సెంటర్, రూ.200 కోట్లతో వేములవాడ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని, పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రుద్రంగి మండలకేంద్రంలో ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, 10 సంవత్సరాలుగా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డులను మంజూరుచేశామన్నారు. ఈప్రాంతంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్‌వోసీల ద్వారా సుమారు 20 కోట్ల రూపాయలు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వేములవాడ నియోకవర్గంతో పాటు రుద్రంగి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకలు తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేశిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, కొమిరె శంకర్, పల్లి గంగాధర్, ఎర్రం రాజలింగం, స్వర్గం పరంధాములు, పిడుగు లచ్చిరెడ్డి, దయ్యాల శ్రీనివాస్, గండి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

**- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1413 ఇళ్లు గ్రౌండింగ్ కాగా, మిగతావి కూడా గ్రౌండింగ్ చేయాలన్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల వారిగా కేటాయించిన ఇళ్లు ఇప్పటివరకు గ్రౌండింగ్‌పై అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల మార్క్ ఔట్‌లో ఉత్తమ పనితీరు చూపుతున్న పంచాయతీ కార్యదర్శులను అభినందించారు. పేదలకు సొంత ఇంటి కల నేరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసి చేస్తోందన్నారు. మొదటి విడతలో ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ 5లక్షలు ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో అందజేస్తుందన్నారు. 400చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన వారికి ఇసుక ఉచితంగా అందిస్తుందన్నారు. గ్రామాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శులు నిత్యం పరిశీలించి వివరాలను అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, హౌజింగ్ పీడీ శంకర్, డీపీవో షర్ఫుద్దీన్, డీఎల్పీవో నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**- ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ**


ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మత పెద్దలు చూడాలని ఎస్పీ మహేష్ బీ గీతే అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లోని ఈద్గాను శుక్రవారం సాయంత్రం ఎస్పీ మహేష్ బీ గీతే పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులతో ఏర్పాట్లపై చర్చించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద పోలీసులతో భద్రాతపరమైన ఏర్పాట్లు చేశామన్నారు. పండుగను అందరు కలిసిమెలిసి జరుపుకోవాలని, దీనికి పోలీస్ శాఖ అవసరమైన భద్రత ఏర్పాట్లు చేస్తుందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టలను ఏర్పాటు చేసి ప్రతి చెక్‌పోస్టలలో పోలీసులు 24 గంటలు వాహనాల తనిఖీలు చేపట్టి పశువుల అక్రమ రవాణా జరగకుండా విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. సామాజిక మధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్ట్‌చేసిన, ఫార్వార్డ్ చేసిన వారితోపాటుగా గ్రూప్ అడ్మిన్‌లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య భద్రతపై జాగ్రత్త వహించాలి

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత**


శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య భద్రత కోసం ప్రజలు కొన్ని జాగ్రత్తలు వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, హెపటైటీస్ బీ, సీ, సుఖవ్యాధుల(హెచ్ఐవీ)ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు మాసం వరకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్య భద్రత కోసం జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆరోగ్యకేంద్ర పరిధిలో ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, టీబీ కోఆర్డినేటర్ బిగిందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

ఇల్లంతకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట ఎస్సైగా సిరిసిల్ల అశోక్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శ్రీకాంత్‌గౌడ్ కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా, రుద్రంగిలో పనిచేసిన అశోక్ ఇల్లంతకుంట ఎస్సైగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైకి సిబ్బంది అభినందనలు తెలిపారు.

## మాతాశిశు సంరక్షణ కేంద్రంలో శిశువు మృతి

● వైద్యుల నిర్లక్ష్యమని బాధితుడి ఫిర్యాదు, కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మతాశిశు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రసవసమయంలో శిశువు మృతి చెందినట్లు కరీంనగర్‌రూరల్ మండలం చెర్లబూత్కూర్‌కు చెందిన లింగంపల్లి మహేష్ టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. తన భార్య లింగాల వనితను మాతాశిశుఆస్పత్రిలో గురువారం సాయంత్రం ప్రసవం కోసం చేర్పించామని, హార్ట్‌బీట్ చెక్ చేసేందుకని కింది అంతస్తు, పైఅంతస్థుకు రెడుసార్లు నడిపించారని పేర్కొన్నాడు. పురిటినొప్పులతో బాధపడుతున్న తనభార్యను పట్టించుకోకుండా పెద్దడాక్టర్ రావాలంటూ అర్ధరాత్రి 12వరకు తాత్సారం చేశారని, చివరకు ఆపరేషన్ థియే టర్‌లోకి తీసుకెళ్లారని తెలిపాడు. అనంతరం ఆపరేషన్ సమయం లో శిశువు గుండె ఆగిపోయి చనిపోయినట్లు తెలిపారని పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు.

## బావిలోపడి వృద్ధురాలి మృతి


శంకరవ్వ (ఫైల్)

లక్షెట్టిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గంప లపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి బొప్పు శంకరవ్వ(69) మృతి చెందింది. మృతురాలి స్వస్థలం ధర్మపురిమండలం రాయపట్నం. ఈనెల4న తనమనుమడి వివాహం సందర్భంగా గంపలపల్లికి వచ్చింది. రాత్రి ఇంటికి వెళ్తున్నట్లు బంధువులతో చెప్పి వెళ్లిపోయింది. అర్ధరాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మరుసటిరోజు రాత్రివరకు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కూతురు మంగవ్వ లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఎస్సైసురేష్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం గంపలపల్లి ఇంటి సమీపంలో మృతురాలు మృతదేహం లభ్యంకాగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్ చెరువులో పడి ఒకరి మృతి

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామంలో ట్రాక్టర్‌తో పంటచేనును దున్నుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి కామెర తిరుపతి(45) అనేవ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంథని మండలం దుబ్బపల్లికి చెందిన తిరుపతి తన అత్తగారి గ్రామమైన చెన్నూరు మండలం గంగారం గ్రామానికి నెల రోజులక్రితం వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. తిరుపతి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌తో తన బంధువుల పంట చేనును దున్నుతున్నాడు. ట్రాక్టర్‌ను రివర్స్‌లో ఒడ్డుపైకి ఎక్కిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌పక్కనఉన్న చేపలచెరువులో పడింది. అందులో కొంతనీరు ఉండడంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. తిరుపతికిభార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకుకేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

# బైపాస్ రహదారికి మోక్షమెప్పుడో?

● పెద్దపల్లి పట్టణం మీదుగా రాజీవ్ రహదారి
● నిత్యం ప్రమాదాలు
● ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు సతమతం
● ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినా ప్రారంభంకాని పనులు



పెద్దపల్లిటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణానికి బైపాస్ రహదారి నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. పదిహేను ఏళ్ళుగా ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా బైపాస్ రోడ్డు కల నెరవేరడం లేదు. దీంతో ట్రాఫిక్ అంతరాయంతోపాటు తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బైపాస్ రోడ్డుకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు మొదలుకావడం లేదు.

### ప్రతిపాదనలు ఇలా...

బైపాస్ రహదారితోపాటు రింగ్ రోడ్డు లేదా పట్టణం నుంచే ఫ్లైఓవర్‌లో ఏదో ఒకటి నిర్మించాలని గతంలోనే నిర్ణయించారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల నుంచి చందపల్లి మీదుగా అప్పన్నపేట వద్ద రాజీవ్ రహదారికి లింక్ అయ్యేలా నిర్మించాలని ప్లాన్ చేశారు. అలాగే పెద్దకల్వల నుంచి హన్మంతునిపేట మీదుగా అప్పన్న పేట ఫ్లైఓవర్ లింక్ అయ్యేలా మరో ప్లాన్ చేశారు. కానీ ఇప్పటి వరకు ఈ రెండు అమలుకు నోచుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా బైపాస్ రోడ్ నిర్మాణంలో ఆలస్యం అవుతుండటంతో ప్రయాణికులు, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే బైపాస్ నిర్మాణం మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూసర్వే చేసేందుకు అధికారులను పురమాయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబర్ 4, 2024న పెద్దపల్లి పర్యటనకు వచ్చినప్పుడు బైపాస్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. 80 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారు.ఆరు నెలలు పూర్తవుతున్నా, రోడ్డు నిర్మాణానికి అడుగు ముందుకు పడడంలేదు.

### పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు

వాహనాల సంఖ్య పెరిగిపోతున్నా అందుకు తగిన పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించలేని విధంగా తయారైంది. జిల్లా కేంద్రంలో రాజీవ్ రహదారిని ఆనుకొని రంగంపల్లి నుంచి శాంతి నగర్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఈ రహదారి ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు పట్టణం వాహనాలతో బిజీగా ఉంటుంది. పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెయిడ్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ట్యాక్సీ కార్ల కోసం పెద్దపల్లి జూనియర్ కాలేజీ, బస్టాండ్ ఏరియాల్లో పార్కింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆటోలకు కూడా పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### ఇరుకు రోడ్డు... పెరిగిన రద్దీ


ఇష్టారాజ్యాంగా రోడ్డుపై నిలిపిన ఆటోలు

పట్టణంలోని మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి పెద్ద కల్వల కలెక్టరేట్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో బైపాస్ రోడ్డు అవసరమని 15 ఏళ్ళ క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ రహదారిపై ఇసుక, మట్టి లారీలతోసహా అన్ని వాహనాలు పట్టణం మధ్య నుంచే వెళ్ళాల్సి ఉంటుంది. గోదావరిఖని వద్ద 25 ఏళ్ళ క్రితం గోదావరి బ్రిడ్జి నిర్మించడంతో భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. జమ్మికుంట వైపు రెండు బ్రిడ్జిలు నిర్మించడంతో వరంగల్ వైపు వెళ్ళే వాహనాలు పెద్దపల్లి మీదుగా వెళ్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. ట్రాఫిక్ పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా నియంత్రించలేకపోతున్నారు. ప్రధానంగా బస్టాండ్, అయ్యప్ప సర్కిల్, ఆసుపత్రి చౌరస్తా, కూనారం రోడ్డు, కమాన్‌చౌరస్తాలో ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపైనే ఆటోలు నిలపడంతో ఇబ్బంది ఎదురవుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ రహదారిని ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నారు. కూనారం సర్కిల్‌లో ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

## బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20సంవత్సారాల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు 3,900 రూపాయల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా మొదటి అదనపుజడ్జి నారాయణ శుక్రవారం తీర్పునిచ్చారు. జగిత్యాల జిల్లాలోని రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి సామల్ల అరవింద్ (28) అనే యువకుడు 2021 సంవత్సరంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై రాయికల్ పోలీసులు పోక్సో కింద కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కృష్ణ కుమార్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ శుక్రవారం సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్షపడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

## దాడి కేసులో నలుగురికి నాలుగేళ్ల జైలు శిక్ష

● రూ. 5 వేల జరిమానా

వేములవాడ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఒకరిపై నలుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటనలో నాలుగేళ్ల జైలు శిక్షతో పాటుగా రూ.5వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు పోలీసులు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అనుపురం గ్రామానికి చెందిన లక్ష్మీరాజ్యం అనే వ్యక్తిని తన భార్య బాలవ్వని పాతకక్షలతో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్, అంజయ్య, ముత్తయ్య, ప్రసాద్, శశి అనే ఐదుగురు కలిసి దాడిచేయడంతో బలమైన గాయం అయ్యిందని, అప్పటి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. కోర్టులో అప్పటి ఎస్సై మారుతి, కోర్టు కానిస్టేబుల్ మధు కలిసి సాక్షులను ప్రవేశపెట్టగా, సాక్షులను విచారించిన కోర్టు నలుగురిపైనేరం రుజువుకావడంతో ప్రవీణ్, అంజయ్య, ముత్తయ్య, శశిలకు నాలుగు సంవత్సరాల జైలు శిక్షతో పాటుగా రూ. 5 వేల జరిమానా విధించినట్లు రూరల్ సీఐ పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారులోని కెనాల్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం రాగలపల్లికి చెందిన ఇండ్ల కనకరాజు(39) మృతిచెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కనకరాజు కరీంనగర్ నుంచి జగిత్యాలకు బైక్‌పై వెళుతుండగా ఉదయం 6గంటల సమయంలో ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కనకరాజును స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి కుటుంబ సభ్యులు మరొక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

# హైలెవల్ బ్రిడ్జి నిర్మించేదెప్పుడో?

● మూడేళ్ల క్రితం నిధులు మంజూరు ● టెండర్ ప్రక్రియ పూర్తయినా ప్రారంభంకాని పనులు
● పెగడపల్లిలో లో లెవల్ బ్రిడ్జితో ప్రయాణికుల ఇక్కట్లు


పెగడపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో లో లెవల్ బ్రిడ్జి

పెగడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెగడపల్లి నుంచి గోపాల్‌రావుపేట వెళ్లేమార్గంలో పెగడపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. నిధులు మంజూరై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తికాగా పనుల ప్రారంబానికి నోచుకోక దాదాపు మూడేళ్లవుతోంది. వర్షాకాలంలో భారీవర్షాలు కురిసినపుడు లోలెవల్ బ్రిడ్జిపై నుంచిభారీగా వరదనీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిధులు మంజూరయ్యాయి, బ్రిడ్జి నిర్మాణం జరిగితే తమ ప్రయాణబాధలు తీరిపోతాయని ఆశపడ్డ మండలప్రజలకు, ప్రయాణికులకు మూడేళ్లవుతున్నా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జోక్యం చేసుకుని నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ ఆదిత్యను వివరణ కోరగా కాంట్రాక్టర్ మరణంతో పనులు ప్రారంభం కాలేదని, త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

● ఒకే కుటుంబంలోని ఆరుగురికి తీవ్ర గాయాలు
● క్షతగాత్రులంతా గుంటూరు జిల్లా వాసులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించిన ఓ కుటుంబం తిరుగు ప్రయాణంలో కారు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి మూలమలుపు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం మండలం నల్లపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన చల్ల గిరిధర్‌రెడ్డి, అతని భార్య సంగీత, వదిన రాధ ఆమె పిల్లలు సాత్విక, సాహిత్య, మనోజ్ఞలు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చల్ల గిరిధర్‌రెడ్డి నిజామాబాద్ పట్టణంలో ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. తిరిగి వెళ్తున్న క్రమంలో కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన పాముల సతీష్ ట్రాలీ ఆటోతో కారు అతివేగంగా ఢీకొట్టాడు. బాధితుడు గిరిధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామశివారులో గురువారంరాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగాఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు అడవిపదర గ్రామానికి చెందిన నవీన్, పవిత్ర, మమత, రవీందర్‌కు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను మండలకేంద్రంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్నపల్లిలోని నవీన్ తన ద్విచక్రవాహనంపై పవిత్ర, మమతతో కలిసి ఎల్లారెడ్డిపేటనుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. అడవిపదిరనుంచి రవీందర్ తనబైక్‌పై ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.కేసునమోదు చేసిదర్యాప్తు జరుపుతున్నామని పోలీసులుతెలిపారు.

## ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

● పలువురిపై కేసు నమోదు


జగిత్యాల క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని ధరూర్ క్యాంపులోని నీటిపారుదలశాఖకు చెందిన ప్రభుత్వ భూమికి కబ్జాచేసేందుకు యత్నించిన ఇద్దరితోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాలటౌన్ సీఐ వేణుగోపాల్ ఒకప్రకటనలో తెలిపారు. ధరూర్ క్యాంపులోని సర్వేనంబరు 163లో దేవతామూర్తుల విగ్రహాలను అడ్డం పెట్టుకుని ఐదు గుంటల భూమిని కబ్జాకు యత్నిస్తున్నారనినీటిపారుదలశాఖ ఏఈఈ ఇంద్రాల జాగృతి పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో చొప్పరిరాజు, జిట్టవేణి అరుణ్‌తోపాటు మరికొంత మందిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ వేణుగోపాల్ వివరించారు.

## దొంగతనానికి యత్నం

గంగాధర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని వైన్స్ పర్మిట్‌రూం తలుపులు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోయినపల్లిదారిలోని వైన్స్ పర్మిట్‌రూం తలుపులను అర్ధరాత్రి పగులగొట్టి రూంలోని వస్తువులను చిందరవందర చేసినట్లు గుర్తించారు. రూంలో ఎలాంటివస్తువులు అపహరణకు గురికాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.యజమాని లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం ఇరుకుల్లకు చెందిన కాశిపాక భరత్ జనవరి 26న తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా శుక్రవారం అప్పగించామని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో రూరల్ కానిస్టేబుల్ విశ్వతేజ సాంకేతిక పరిజ్ఞానంతో ఆ సెల్‌ఫోను మంచిర్యాలలో ఉన్నట్లుగా గుర్తించారని, స్వాధీనం చేసుకొని బాధితుడు భరత్‌కు అప్పగించామని పేర్కొన్నారు. కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు

## రోడ్డుపై పరుచుకున్న పచ్చదనం

ఇల్లంతకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో బాటసారులకు చల్లని నీడను ఇస్తున్నాయి. మండలంలోని పండలాపూర్, కందికట్కూర్ గ్రామాల మధ్యలోని ప్రధాన దారి వెంట గతంలో నాటిన మొక్కలు గుబురుగా పెరగడంతో అటుగా వెళుతున్న వారి చూపులను ఆకట్టుకోవడమే కాకుండా వీటి నీడన కొంతసేపు సేద తీరుతున్నారు.

## హద్దులు చెరిపిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

రామడుగు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని సర్వేనం.146లోని ఎస్సీకాలనీకి చెందిన భూమిని హద్దులు చెరిపి సాగు చేసుకుంటున్న కాంగ్రెస్‌పార్టీకి చెందిన కల్లెపల్లి అంజ య్యపై కేసు నమోదు చేయాలని కాలనీవాసులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2024లో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాయంత్రాంగం స్పందించి 42 సంవత్సరాల నుంచి కబ్జాకాబడుతున్న భూమిని కరీంనగర్ ఆర్డీవో పర్యవేక్షణలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే చేసి హద్దులు నిర్ణయించారని అన్నారు. హద్దులు చెరిపి సాగు చేసుకుంటున్న విషయమై గ్రామ పెద్దలు, యువకులు ప్రశ్నించగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు చేపట్టకుంటే కరీంనగర్ ఆర్డీవో, పోలీస్ కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కనకం వంశీ, కనకం కొమురయ్య, చిలుముల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో స్టార్టర్లు, ఫీజులు దగ్ధం

● గునుకుల కొండాపూర్‌లో తెగిపడిన 11కేవీ విద్యుత్ వైర్


రైస్‌మిల్‌లో కాలిపోయిన విద్యుత్‌మీటర్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏడి సత్యనారాయణ రావు

గన్నేరువరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా 11కేవీ విద్యుత్ వైరు తెగి వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌సరఫరా చేసే లైన్ పైన పడడంతో 14మంది రైతులకు చెందిన స్టార్లర్లు, ఫీజులతోపాటు మినీ రైస్‌మిల్ మీటర్ మొత్తం షార్ట్ సర్క్యూట్ అయి దగ్ధం అయ్యాయి. ఒక్కసారిగా హైవోల్టేజీ రావడంతో తమ స్టార్లర్లు, ఫీజులు కాలిపోయాయని అన్నారు. మళ్లీ కొత్తస్టార్లర్లు, ఫీజులు కొనడానికి సుమారు ఐదువేలు ఖర్చు అయిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు అధికలోడ్ ఉండడంతో ప్రతిరోజు విద్యుత్‌సమస్యలు తలెత్తుతున్నాయని విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి మరోట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. రైస్‌మిల్‌లో కాలిన విద్యుత్‌మీటర్‌ను విజిలెన్స్ ఏడి సత్యనారాయణరావు పరిశీలించారు.

# యారన్ సబ్సిడీ అందించాలి


వినతిపత్రం అందిస్తున్న టెక్స్‌టైల్ పార్కు కార్మికులు

తంగళ్లపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కులో కార్మికులకు యారన్ సబ్సిడీ తక్షణమే అందించాలని, నిరంతరం ఉపాధితోపాటు మెరుగైన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చేనేత జౌళిశాఖ జాయింట్‌డైరెక్టర్ ఎన్‌వీరావుకు కార్మికులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామ శివారులో టెక్స్‌టైల్‌పార్కులో సీఐటీయూ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో యారన్ సబ్సిడీ, ఉపాధి తదితర కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ క్రమంలో శుక్రవారం చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్‌విరావు టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఎన్‌వి రావును కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. సానుకులంగా స్పందించి వారంరోజుల్లో యారన్ సబ్సిడీ విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్కు అధ్యక్షుడు కూచన శంకర్, మామిడాల శ్రీనివాస్, రాచర్ల వేణు, పులి రమేశ్, కందికట్ల శ్రీనివాస్, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

# ముగిసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్‌అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. జిల్లాక్రికెట్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్, వేములవాడ, జగిత్యాల, గోదావరిఖనిలో నిర్వహించిన శిబిరాల్లో 700మంది క్రీడాకారులు 25రోజులపాటు శిక్షణ పొందారు. ఈశిబిరాల్లో బాలబాలికలకు బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్, ఫీల్డింగ్, క్యాచింగ్ తదితర అంశాల్లో శిక్షణ అందించారు. ఈ శిబిరాల్లో శిక్షణ పొందిన బాలబాలికలకు హైదరాబాద్ క్రికెట్‌అసోసియేషన్ అపెక్స్‌సభ్యులు అందించిన సహకారంతో నిర్వాహకులు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు, మనోహర్‌రావు, రవీందర్‌గౌడ్, నితిన్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలతో శిక్షణ పొందిన క్రీడాకారులు

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

జగిత్యాలరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామివేత్తలుగా ఎదగాలని జిల్లా అలీవ్ రాష్ట్ర మహిళశక్తి ప్రాజెక్ట్ అధికారి అన్నపూర్ణ సూచించారు. జగిత్యాల రూరల్ మండలం ఐకేపీ కార్యాలయ సమావేశ మందిరంలో జగిత్యాల, చొప్పదండి నియోజకవర్గాలకు చెందిన మహిళా స్వయం సహాయక సభ్యులకు శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళాసంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రణాళికను రూపొందించిదని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి యాదగిరి, ఏపీడీ చరణ్‌దాసు, డీపీఎంలు భారతి, మల్లేశం, జిల్లా ఏపీఎం చక్రవర్తి, మండల ఏపీఎం ఓదెల గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్, మరియా, శ్రీనివాస్, సాగర్, జగిత్యాల, చొప్పదండి మహిళా సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7400 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 30క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.6500 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.



# పోడు భూములకు జల సిరులు

| విడతలు | నిధులు (రూ.కోట్లలో) | లబ్ధిపొందే రైతులు | ఎకరాలు |
|---|---|---|---|
| తొలి విడత (2025-26) | 600 | 10,000 | 27,184 |
| రెండో విడత (2026-27) | 3,000 | 50,000 | 1,43,204 |
| మూడో విడత (2027-28) | 3,000 | 50,000 | 1,43,204 |
| నాలుగో విడత (2028-29) | 3,000 | 50,000 | 1,43,204 |
| ఐదో విడత (2029-30) | 3,000 | 50,000 | 1,43,204 |
| **మొత్తం** | **12,600** | **2,10,000** | **6,00,000** |

- ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలుకు కసరత్తు
- రాష్ట్రంలో తొలి విడతలో 10 వేల మంది ఎస్టీ రైతులకు వర్తింపు
- ఐదేళ్లలో ఐదు విడతల్లో ఆరు లక్షల ఎకరాలకు నీరు
- రాష్ట్రంలో 2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు లబ్ధి
- రూ.12,600 కోట్ల బడ్జెట్ అంచనా

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల పోడు సాగుకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌వోఆర్ పట్టాలు ఇచ్చిన పోడు భూముల్లో నీటి వనరులున్న భూములకు కాకుండా సేద్యానికి అవసరమైన సాగు నీరు అందించేందుకు ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదు సంవత్సరాల్లో ఐదు విడతలుగా రూ.12,600 కోట్ల నిధులతో 2.10 లక్షల మంది గిరిజన రైతులకు చెందిన ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిపై ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులకు ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు.

### లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

ఇందిర సౌర గిరి జల వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం మండల కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఎంపీడీవో, భూగర్భ జల అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి, గిరిజనాభివృద్ధి శాఖ అధికారి సభ్యులుగా ఉంటారు. ఆర్‌వోఆర్ పట్టాలు అందుకున్న పోడు భూములకు చెందిన గిరిజన రైతుల నుంచి కమిటీ దరఖాస్తులను స్వీకరించనుంది. వాటిని పరిశీలించి బోరు వేస్తే నీరు వచ్చే భూములను గుర్తించి ఎంపిక చేయనున్నారు. పథకంలో భాగంగా పోడు భూముల్లో సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు నీరందించనున్నారు. సౌర విద్యుత్‌తో పంప్ సెట్లు నడిపించుకోగా మిగులు విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు విక్రయించే అవకాశం ఉంటుంది. మిగులు విద్యుత్ ద్వారా గిరిజన రైతులకు నెలకు ఐదు వేల రూపాయల వరకు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు. సోలార్ విద్యుత్ పరికరాలు అమర్చి బోరు బావిలో మోటార్ బిగించనున్నారు. భూముల స్వభావాన్ని బట్టి జామ, మామిడి, నిమ్మ, వివిధ రకాల పూల సాగు, ఆయిల్‌పామ్ ఇతర తోటలు పెంచేలా రైతులను ప్రోత్సహించడానికి కసరత్తు చేస్తున్నారు.

### ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..



ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ద్వారా పోడు భూములకు సాగు నీరు అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈమేరకు అవసర మైన కసరత్తులు చేస్తున్నాం. గిరిజన రైతులకు చెందిన అర్హమైన పోడు భూములను గుర్తించడం, సాగునీరు, సౌర విద్యుత్ సౌకర్యాలను కల్పించడా నికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. అర్హులైన రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**రాజ్‌కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి, జగిత్యాల**

## అక్రమంగా నీటిని తరలిస్తే చర్యలు

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



జంగంకుంట చెరువును పరిశీలిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల అనుమతి లేకుండా అక్రమంగా నీటిని తరలిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హెచ్చరించారు. పెగడపల్లి మండలంలోని నామాపూర్ గ్రామశివారులోని జంగంకుంట చెరువును ఆయన మండల నాయకులు, రైతులతోకలిసి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న కాళేశ్వరం లింక్-2కాలువ పక్కనే ఉన్న చెరువులోని నీటిని మెగాకంపెనీ పైపులద్వారా తరలించారని స్థానికరైతులు అధికారులకు, పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విప్ లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం చెరువును పరిశీలించి మాట్లాడుతూ చెరువులో నీటిని ఎట్టిపరిస్థితిలో తీయవద్దని ఇరిగేషన్‌శాఖ డీఈ నర్సింగరావును ఆదేశించారు. రైతులు త్యాగంచేసి భూములు ఇవ్వడంవల్లనే నేడు ప్రాజెక్టుపనులు సాగుతున్నాయని అన్నారు. రైతులు తమ విలువైన భూములు ఇచ్చినపుడు వారిని గౌరవించడం నేర్చుకోవాలని ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. మరోసారి ఇలాంటి సమస్య ఉత్పన్నమైతే చట్టపరమైన చర్యలు తప్పవని మెగా కంపెనీ ఏజీఎం దినేష్ సింగ్‌ను లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు.

## వ్యాపారం పేరిట మోసం.. ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వ్యాపారం పేరిట రూ.92 లక్షలు తీసుకొని మోసం చేసిన కేసుల్లో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైం డీఎస్పీ నరసింహారెడ్డి వివరాల ప్రకారం. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద 2024 జూలై, నవంబరుల్లో మహారాష్ట్ర పూణేకు చెందిన ప్రసాద్ సురేష్ గువహానే, చందన్‌విఠల్ గువహానే, ఉస్మానాబాద్ జిల్లాకు చెందిన శ్రేయాస్ ముకుంద్‌కోలి బిజినెస్ ఇన్వెస్ట్మెంట్, రేటింగ్ అండ్ రివ్యూ ప్రకటనలు, పార్ట్‌టైం ఉద్యోగాల కల్పన వంటి విషయాలతో బాధితులను ఆకర్షించి రూ.92 లక్షలు పలు దఫాలుగా డిపాజిట్ చేయించుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో మహారాష్ట్రలో అరెస్టు చేసి శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

## జీవాలకు మెరుగైన చికిత్స అందించాలి

- 8న రాజన్న కోడెల పంపిణీ
- కలెక్టర్ సందీపకుమార్ ఝా



రాజన్న కోడెలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని అనారోగ్యంతో ఉన్న కోడెలకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వెటర్నరీ అధికారులకు సూచించారు. గోశాలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి కోడెలకు అందుస్తున్న చికిత్సను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదిన ఆదివారం గోశాలలోని కోడెల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన కోడెలకు అందిస్తున్న చికిత్సపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నామని, వాటి పరిస్థితులను స్వయంగా పరిశీలించామన్నారు. గోశాలలోని పెద్ద కోడెల ద్వారా గాయాలపాలైన చిన్న కోడెల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత ఉద్యోగులకు సూచించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఈనెల 8వ తేదిన ఆదివారం గోశాలలోని కోడెలను అర్హులైన రైతులకు అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన రైతులు ఆన్‌లైన్‌లో జిల్లా వెబ్‌సైట్ గాని ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జియో ట్యాగింగ్, వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేయడంతో కోడెలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.

### మరో రెండు కోడెలు మృతి..

- అనారోగ్యంతో 11 కోడెలు.. 3 కోడెల పరిస్థితి విషమం,

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం తెల్లవారు జామున మరోరెండు కోడెలు మృతిచెందినట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకు మృతిచెందిన కోడెల సంఖ్య 31కి చేరింది. తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలలో రెండు కోడెలు మృతిచెందినట్లు తెలిపారు. గోశాలలో ఉన్న 1300 పశువులలో ప్రస్తుతం 11 కోడెలకు వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని, అనారోగ్యంతో ఉన్న కోడెలు కోలుకుంటున్నాయని పేర్కొన్నారు. కాగా గోశాలలోని 3 కోడెల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గోశాలలో కొత్తగా కోడెలు అనారోగ్యానికి గురికాలేదని, కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



బోనాలతో ఆలయానికి బయలు దేరిన భక్తులు

మల్లాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామంలోని స్థానిక గంగ పుత్రులు శుక్రవారం భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని భక్తులు ఆలయంలోని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసుకొని నెత్తిన ఎత్తుకోని ఊరేగింపుగా డప్పుచప్పుల మధ్య ఆలయానికి బయలు దేరారు. జల పందిరి వేసి సల్లగా చూడు తల్లి అంటూ బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు, గంగపుత్రులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కీర్తి మెడికల్స్ ప్రారంభం



కీర్తి మెడికల్స్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఉమేశ్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన కీర్తి మెడికల్స్‌ను శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేశ్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్‌రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీర్తిమెడికల్స్ సేవలు 24గంటలపాటు అందుబాటులో ఉంటాయన్నారు. 30వేల రకాల మందులు, ప్రముఖ కంపెనీలకు చెందిన మందులు హోల్‌సేల్ ధరలకే లభిస్తాయన్నారు. కీర్తి మెడికల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జనరల్ మెడిసిన్స్, బేబీకేర్, సర్జికల్‌కు సంబంధించిన మందులుఅందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కీర్తి మెడికల్స్ మేనేజ్‌మెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూములు లేవు..

- వేములవాడలో గదులు లభించక భక్తుల ఇబ్బందులు
- నందీశ్వర కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్నా లేవని చెబుతున్న ఉద్యోగులు
- తప్పని పరిస్థితిలో ప్రైవేటును ఆశ్రయిస్తున్న భక్తులు
- ఆలయ అధికారుల తీరుపై ఆగ్రహం




విచారణ కార్యాలయం గేటు ఎదుట ప్రైవేట్ లాడ్జీల నిర్వాహకులు

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న భక్తులు గదులు దొరకక తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రూములు ఖాళీగా లేవు.. ఇంకెక్కడనైనా చూసుకోండి.. అంటూ రాజన్న నందీశ్వర కాంప్లెక్స్‌లో విధులు నిర్వహించే సిబ్బందిచెబుతూ వారిని ప్రైవేట్ రూమ్‌లకు వెళ్లాలని చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' జాతర గ్రౌండ్‌లోని నందీశ్వర కాంప్లెక్స్‌ను విజిట్ చేయడంతో పలు విషయాలు వెలుగుచూశాయి. ముందుగా జాతరగ్రౌండులోని విచారణ కార్యాలయానికి వెళ్లి అడిగితే నందీశ్వర చౌల్ట్రీలో ఏసీ గదులు మొత్తంగా 57 ఉండగా, 21గదులు భక్తులకు ఇవ్వగా, మరో 36ఖాళీగా ఉన్నాయని సమాచారమిచ్చారు. అందులోనే ఏసీ గదులు 111ఉండగా 44గదులు భక్తులు తీసుకోగా 67 గదులు ఖాళీగా ఉన్నాయని అక్కడిసిబ్బంది తెలిపారు. నందీశ్వర చౌల్ట్రీలోకి గదులకు కోసం వెళ్లినభక్తులకు అక్కడ విధుల్లో అటెండర్ గదులు లేవని, మరెక్కడైనా తీసుకోవాలని చెప్పాడు.

- పైరవీలు చేస్తేనే గదులు

వేములవాడ విచారణ కార్యాలయం వద్ద గదుల కోసం పెద్ద ఎత్తున భక్తులు నిరీక్షిస్తున్నారు. పైరవీలు చేస్తే తప్ప రూమ్‌లు ఇవ్వడం లేదని భక్తులు చెబుతున్నారు. తమ ముందే పైరవీలతో వచ్చిన వారికిగదులు కేటాయిస్తున్నారని, తమని మాత్రం క్యూలైన్‌లో నిలుచోబెట్టి లేనిపోనివి చెప్పి గదులు ఇవ్వడం లేదంటూ భక్తులు వాపోతున్నారు. రాజన్న ఆలయానికి చెందిన పది చౌల్ట్రీల్లో 453 గదులు ఉండగా శుక్రవారం సాయంత్రం వరకు 148గదులు మాత్రమే భక్తులకు ఇచ్చారు. గదులు ఖాళీగా ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.

- విచారణ కార్యాలయం ఎదుటే ప్రైవేటు వ్యక్తులు..

రాజన్న ఆలయ విచారణ కార్యాలయం ఎదుట గేట్ వద్ద ప్రైవేటు లాడ్జీల నిర్వాహకులు నిలబడి భక్తులను భక్తులను ఇబ్బంది పెడుతున్నారు. ఆలయ గదులు అయిపోయాయని మాయమాటలు చెప్పి తమ గదులకు తీసుకెళ్లి ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా ఆలయ అధికారులు పట్టింకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



నందీశ్వరలో తాళం వేసి ఖాళీగా ఉన్న గదులు

- అస్తవ్యస్తంగా పారిశుధ్యం

వేములవాడ జాతర గ్రౌండ్‌లోని నందీశ్వర కాంప్లెక్స్‌లో వాటర్ ప్లాంట్ వద్ద నాచుతో మురికిగా మారినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గదుల వద్దకు వెళ్లే మార్గంలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని గదుల్లో ఏసీలు పని చేయడం లేదు. అక్కడి సిబ్బందిని అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందీశ్వర కాంప్లెక్స్‌లో కుక్కలు తిరుగుతుండడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు.



ఖాళీ గదులను చూపిస్తున్న డిస్‌ప్లే

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా జట్టు

- ఫైనల్స్‌లో వరంగల్‌పై ఘన విజయం




ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి 47వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సొంతం చేసుకుంది. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 10 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికల జట్లు తలపడ్డాయి. శుక్రవారం నిర్వహించిన బాలుర ఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు వరంగల్ జిల్లా జట్టుపై 20-13 పాయింట్ల తేడాతో గెలుపొందింది. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ బహుమతులు అందజేశారు. జట్టుకు కోచ్‌గా మూల వెంకటేశ్, మేనేజర్‌గా శ్రీకాంత్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసర వేణి లక్ష్మణ్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, పెటాటీఎస్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి వేణుగోపాల్, సంఘం బాధ్యులు సురేందర్, ప్రేమ్, తిరుమలేష్, శ్రీనివాస్, రాజు అభినందించారు.

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు.

రాజన్నకు ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తరించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

## వీడని 'డీఎస్ఆర్' పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

పరిస్థితిపై ఆవేదన చెందుతున్నారు. గ్రామపంచాయతీలో సిబ్బంది కొరత కారణంగా తీవ్ర పనిభారాన్ని అనుభవిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీఎస్ఆర్ ద్వారా పనులు కావాలంటే సిబ్బందిని పెంచాలని కోరుతున్నారు.

**ఇప్పటికే అనేక యాప్‌లు..**

ప్రభుత్వం ఇప్పటికే అనేక యాప్‌లను తీసుకురావడంతో ఫోన్లు పనిచేయని పరిస్థితి ఉందని కార్యదర్శులు వాపోతున్నారు. ప్రభుత్వపరంగా దాదాపు పదికి పైగా యాప్‌లను ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల సర్వేలు, ఇతర పనులు గ్రామాల్లో నిర్వహిస్తున్న తమకు డీఎస్ఆర్ ఇబ్బందికరంగానే ఉందని, అలాగే థర్డ్ పార్టీ యాప్‌ల వల్ల సైబర్ నేరగాళ్ల చేతిలో తమ వివరాలు వెళ్లే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు.

## స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

చందుర్తి జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం నర్సింగాపూర్, మల్యాల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఓరుగంటి రిచిత కపిల శ్రీహర్ష తీగల చైత్రిక్, శ్రీధర్ల దీక్షిత అనే విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ ఎగ్జామ్స్‌లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచింది. 4సంవత్సరాల పాటు రూపాయలు పన్నెండు వేల చొప్పున స్కాలర్‌షిప్ పొందనున్నారు. విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ఆవరణలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించడంతో పాటు అభినందించారు.

## బాధ్యతలు స్వీకరించిన సహకార సంఘ పాలకవర్గం

ఇల్లంతకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట సహకార సంఘ పాలకవర్గం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దు చేసి ప్రభుత్వం పర్సన్ ఇంచార్జీని గతంలో నియమించింది. దీనితో పాలకవర్గ సభ్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాసహకార అధికారి రామకృష్ణ గతంలో పనిచేసిన పాలకవర్గాన్ని ఆరు నెలల పాటు కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో శుక్రవారం అధ్యక్షుడు రొండ్ల తిరుపతిరెడ్డి, సభ్యులుగా గొడుగు తిరుపతి, కట్ట సుధాకర్‌రెడ్డి, నాయిని నవీన్‌కుమార్, కోమటిరెడ్డి నర్సింహ్మారెడ్డి, చల్ల నవీన్‌కుమార్‌రెడ్డి, గన్నారం వసంత, పల్లె సృజన్‌రెడ్డి, గజ్జల సత్తయ్య, పారిపెల్లి లక్ష్మి, కట్ట లచ్చయ్య, జంగిటి కొమురయ్యలు బాధ్యతలు స్వీరించారు. కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

## చారిత్రక విజయాలతో ముందుకు..

ఇల్లంతకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చారిత్రక విజయాలతో ముందుకు సాగుతోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిచర్ల రాజు పేర్కొన్నారు. మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 సంవత్సరాల నరేంద్ర మోదీ పరిపాలనలో దేశం ఆర్థికంగా బలోపేతం అయ్యిందన్నారు. ఆపరేషన్ సిందూర్ లాంటి కార్యక్రమాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ కీర్తి పెరిగిందన్నారు. సంకల్పంతో సాకారం కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం పల్లె దవాఖానలో వసతుల గురించి అడిగి తెలుసుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు దేశెట్టి శ్రీనివాస్, ముత్తవ్వ, మామిడి హరీష్, గజ్జల శ్రీనివాస్, బత్తిని స్వామి, యాదగిరి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, పినకాశి అనీల్, లంకోజు చంద్రం, కమలాకర్‌రావు, గోపాల్, శ్రీహరి, రాజు, శ్రీకాంత్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రుద్రంగి ఇన్‌చార్జి ఎస్ఐగా మోతిరామ్

రుద్రంగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి ఇంచార్జ్ ఎస్ఐగా అయ్యగా మోతిరాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రుద్రంగి ఎస్ఐగా విధులు నిర్వహించిన సిరిసిల్ల అశోక్ ఇల్లంతకుంట మండలానికి బదిలీపై వెళ్లారు. వేములవాడ టౌన్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ మోతీరామ్ బదిలీపై రుద్రంగి ఇంచార్జ్ ఎస్సై బాధ్యతలు స్వీకరించారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలి

వీర్నపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి గడపగడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరించాలని రాష్ట్ర ఓబీసీ స్పోక్స్ పర్సన్ దేవేందర్ యాదవ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు లక్పతి నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి నిరుపేద కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అనూష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, ఎస్టీ మోర్చా మాజీ మండల అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, దిశా కమిటీ సభ్యుడు బట్టు పీర్యా, భూత్ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ అన్నారు. చందుర్తి మండల బీజేపీ అధ్యక్షుడు మొకిలే విజేందర్ ఆధ్వర్యంలో చందుర్తి మండలంలో కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సుపరిపాలన పేదల సంక్షేమం, వికాసిత్ భారత్ దార్శనికతల కార్యకలాపాలను గ్రామాల్లో నాయకులు కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. పర్యావరణ దినోత్సవాల సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట గంగాధర్, సాగర్, మోత్కుపల్లి రాజశేఖర్, బోరుగాయ తిరుపతి, చిలుమల హనుమాయ్య చారి, తోట శంకర్, కొక్కుల నరేష్, నిఖిల్ గణేష్ శ్రీచరణ్ అభి, తిరుపతి కళ్యాణ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాల్లో చేసిన సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకులు మాజీ సెస్ చైర్మన్ అల్లాడి రమేష్, కోనరావుపేట మండల బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల్‌కార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల సహకార సంకల్పపై బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ 11 సంవత్సరాల పాలనలో ప్రపంచంలో భారతదేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చారని అన్నారు. మోడీని విశ్వ గురువుగా ప్రపంచ దేశాలు గుర్తించాలని అన్నారు. నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణస్వామి, మాజీ వైస్ ఎంపీపీ తీగల రవీందర్ గౌడ్, బైరగోని సురేష్, మధు, తిరుపతి, పవన్, సురేష్‌రావు, తీగల జయశ్రీ, యశోద, రాజు, నాగరాజు, విజయ్, వికాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

## పంట మార్పిడి ద్వారా నేల సారవంతం..

**- వల్లంపట్లలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'**



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త కనకదుర్గ

ఇల్లంతకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట మార్పిడి ద్వారా నేల సారవంతం అవుతుందని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు కనుకదుర్గ, భవ్యలు పేర్కొన్నారు. వల్లంపట్ల గ్రామంలోని క్లస్టర్ రైతువేదికలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతు రైతులు యూరియా వాడకాన్ని తగ్గించడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయన్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. విత్తనాలు కొనుగోలు సమయంలో బిల్లులను తప్పనిసరిగా తీసుకొని భద్రపర్చాలని సూచించారు. బిల్లులు ఉన్నట్లయితే పంటనష్టం జరిగినప్పుడు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. పామాయిల్‌ను సాగుచేయడం ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి చెందవచ్చన్నారు.

ఈ సమావేశంలో వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏరియా మేనేజర్ ప్రేమ్‌సాయిరెడ్డి, ఏఈవోలు రవళి, జ్యోతి,లలిత, అర్చన, అభిషేక్, అర్చన, గంగలతో పాటు రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య



అల్మాస్‌పూర్‌లో బడి బాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు

ఇల్లంతకుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య ఉన్నందున పిల్లలను చేర్పించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మండలంలోని కందికట్కూర్, గాలిపెల్లి తదితర గ్రామాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ప్రధానోపాధ్యాయులు మేకల పావని, లక్ష్మీనారాయణ, అమ్మ ఆదర్శకమిటీ చైర్మన్ బట్టు పద్మలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చందుర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు జితేందర్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్, సనుగుల గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు గ్రామస్థుల సమక్షంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రత్యేకతలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జితేందర్, సత్యనారాయణలు మాట్లాడుతూ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలు అందించడం జరుగుతుందన్నారు. గ్రామస్థులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. జలంధర్ రెడ్డి, కె. ముఖేష్, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, గణేష్ ఉపాధ్యాయులు, మ్యాకల పద్మ, కోరెపు శ్రీనివాస్, న్యాతరి నాగమణి, హరిష్మ, మల్లారెడ్డి, శంకర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, గంగాభవాని, శ్రీలత, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలకేంద్రంతో పాటు మోర్రాయిపల్లె, చీకోడ్, గూడెం, ఆవునూర్ బంద నకల్, పోతుగల్ తదితర గ్రామాల్లో బడిబాట గ్రామస భలను శుక్రవారం నిర్వ హించారు. బడీడు పిల్లలందరిని బళ్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో రాజిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై కరపత్రా లను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంఎంసీ చైర్మన్ తలారి రాణినర్సింలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తున్నామని కోనరావుపేట మండల విద్యాధికారి మురళి నాయక్ అన్నారు. కోనరా వుపేట మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబా ట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వియం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సర్కారు బడుల్లోనే ప్రభుత్వం సకల వసతులు కల్పిస్తోందని ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో కృష్ణహరిలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, గుండారం, తిమ్మాపూర్, అక్కపల్లి, అల్మాస్‌పూర్, దుమాల, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో బడి బాట కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో కృష్ణహరిలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయన్నారు. ఆంగ్ల మాధ్యమ విద్యను అందిస్తున్నాయని అన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో పాఠశాలల్లోని సౌకర్యాలు, పదో తరగతి విద్యార్థుల ఫలితాల వివరాలతో కూడిన కర పత్రాలను ఇంటింటా తిరుగుతూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయులు తిరుపతి జాదవ్, కావేరి అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి తండా, బంగిరెడ్డి తండాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లావణ్య, అంగన్వాడీ ఉపాధ్యాయులు రమాదేవి, మంజుల, ఏఎన్ ఎంమంజుల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తాజా మాజీ కౌన్సిలర్‌లు గుండ్లపల్లి రామనుజం, అకునూరి విజయలక్ష్మీలు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నేహ్రూనగర్, అంబేద్కర్‌నగర్, తారకరామానగర్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొ పెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా వార్డు సభలను నిర్వహించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు కే గణేష్, అయిరేని భారతి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌లు అరుకాల లావణ్య, బైరిసంధ్య, ఉపాధ్యాయులు వాసాల హరిప్రసాద్, నందిని, సురేష్, ఎన్ లత, జ్యోతి, లావణ్య, అంగన్‌వాడీ టీచర్ వింధ్యారాణి, ఆర్‌పీ రజిత తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలంలోని గోరంటాల సమీప అటవీ ప్రాంతంలో శుక్రవారం బడిబాటను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. గ్రామంలోని పిల్లలందరిని మనఊరు బడిలోనే చదివించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎర్రం రవీందర్, ఏజీపీసీ చైర్మన్లు సుమ, అనిత, ప్రధానోపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, సంధ్య, భాగ్యలక్ష్మి, ఇందిరా, భవాని, శ్రీశైలం, మమత, లత, నవ్య, జోత్స్న తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో గీత

కోనరావుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆయా గ్రామాల్లో భూమి పూజ చేసిన ఇందిరమ్మ ఇళ్ల త్వరగా పూర్తి చేయాలని మండల స్పెషల్ అధికారి, సీఈవో గీత అన్నారు. కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ మెంబర్స్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక చేశామని అన్నారు. ఇందిర ఇళ్లను సకాలంలో పూర్తిచేసుకునేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ, జిల్లెల్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు. అలాగే లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. జిల్లెల్ల గ్రామంలో పెద్దమ్మ దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నర్ర బాల్‌రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, డెరెక్టర్లు ఆరెపల్లి బాలు, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సత్తు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గడ్డం మధుకర్, ఆసరి బాలరాజ్, మనోజ్, ఉమేష్, తిరుపతి గౌడ్, నర్సయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : నిరుపేద ప్రజల స్వంత ఇంటి కల ఇందిరమ్మ ఇంటితో తీరనుందని ఎంపీడీఓ శశికళ పేర్కొన్నారు. మండలంలోని పత్తికుంటపల్లె గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇంటి పనులు ప్రారంభించాలని సూచించారు. ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి దశల వారిగా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, ఏఈ శ్రీజ, కార్యదర్శి సాయిసుధ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోడ తిరుపతిరెడ్డి, జుట్టు నగేష్, ఏగుర్ల కనుకయ్య, అలువాల పద్మయ్య, బోడ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు లబ్దిదారులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : గూడు లేని నిరుపేదలకు నీడ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లను కేటాయించడంతో స్వంతింటి కల నెరవేరనుందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్యలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, దుమాల, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం లబ్ధిదారులు, స్థానిక నాయకులతో కలిసి వారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సబేరాబేగం, నర్సయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేదను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుకను అందించడంతో పాటు దశల వారిగా పనులు పూర్తయిన వెంటనే బిల్లులను చెల్లిస్తోందని అన్నారు. లబ్ధిదారులు పనులను వేగవంతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, మహేందర్, గౌస్, బుచ్చాగౌడ్, గోపాల్, మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాలరాజు, రమేశ్, రాజురెడ్డి, ఇమాం, బాల్‌రెడ్డి, సతీష్, మధు, శ్రీనివాస్, స్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం



తంగళ్లపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ జయంత్ కుమార్

ఎల్లారెడ్డిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన భూ భారతి చట్టంతో గ్రామాల్లో నెలకొన్న రైతన్న సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ సుజాత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి, పదిర గ్రామాల్లో అధికారులు శుక్రవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతులను నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్ అధికారులు రమేశ్, సతీశ్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, దేవేందర్‌యాదవ్, లచ్చిరెడ్డి, వెంకటేశ్, రాజు, ఎల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలంలో బద్దనపల్లి, తంగళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో తంగళ్లపల్లిలో 17, బద్దనపల్లిలో 55 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ జయంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రావు, ఆర్ఐ దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మల్కపేట, నిజామాబాద్ గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : రైతుల ఇబ్బందులు తొలగించడానికే ప్రభుత్వం గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ ఫారూఖ్ పేర్కొన్నారు. మండలంలోని సిరికొండ, గాలిపెల్లి గ్రామాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదాబైనామాలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐలు సంతోష్, శ్రావణ్‌కుమార్, సింగారెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్, లింగన్నపేట గ్రామాల్లో శుక్రవారం రెవెన్యు సదస్సులు నిర్వహించారు. రెవెన్యు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మారుతిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన రెవెన్యు చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యు సదస్సులను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ రెండు గ్రామాల్లో భూ మస్యకు సంబంధించి 72 దరఖాస్తులు వచ్చాయని, ఈనెల 20 వరకు గ్రామాలవారిగా రెవెన్యు సదస్సులు కొనసాగుతాయన్నారు.

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇల్లు

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ..**

**- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ కాపీని ఆది శ్రీనివాస్‌కు చూపుతున్న లబ్ధిదారులు

వేములవాడ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చింతలఠాణా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించి లబ్ధిదారులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేదల ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టి స్వంత ఇంటి కల సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, గాలిపెల్లి స్వామి, ఊరడి రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎర్రం ఆగయ్య తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళా హోంగార్డుకు గాయాలు

వీర్నపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బాబాయిచెర్వు తండా గ్రామశివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో మహిళా హోంగార్డు జ్యోతికి తీవ్రగాయాలయ్యాయి. విధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా ఘటన జరిగింది. స్థానికులు గమనించి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్ గౌడ్, వీర్నపల్లి ఎల్లారెడ్డిపేట ఎస్ఐలు ఎల్లయ్యగౌడ్, రమాకాంత్ ఆసుపత్రికి చేరుకొని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా హోంగార్డు జ్యోతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

**- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్**

సిరిసిల్ల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలో శుక్రవారం ఇంటర్మీడియట్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కో-ఎడ్యుకేషన్‌కు చెందిన అధ్యాపకులు పర్యటించి ఇంటింటికి వెళ్లి పదవ తరగతి ఉత్తీర్ణులైన పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని ప్రభుత్వ కల్పించే వసతులపై వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్మీయట్‌లో చేరిన పిల్లలకు ఉచిత పుస్తకాలు, నాణ్యమైన విద్యా, ఎంసెట్ తదితర విషయాల్లో నైపుణ్యాలు అందిస్తామన్నారు. ఇంటర్మీడియట్ అనంతరం ఇంజనీరింగ్ విద్యలో ఉచిత విద్యను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ రఘునందర్, అధ్యాపకులు సామల వివేకానంద, అంజనేయులు, చంద్రశేఖర్, వెంకటేశం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 9 నుంచి గీత జ్ఞాన యజ్ఞం

సిరిసిల్ల టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 15వ తేది వరకు సిరిసిల్ల పట్టణం ఆర్యవైశ్య భవనంలో గీత జ్ఞాన యజ్ఞం ఉంటుందని చిన్మయ మిషన్ సిరిసిల్ల శాఖ సభ్యుడు సజ్జనం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ఆర్యవైశ్య భవనంలో గీత జ్ఞాన యజ్ఞం ఆహ్వాన కరపత్రాన్ని చిన్మయ మిషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్న గీత జ్ఞాన యజ్ఞంలో ప్రతి రోజు ఉదయం సాయంత్రం చిన్మయ మిషన్ స్వామి యజ్ఞానంద ఆచార్యులు ప్రశ్నోపనిషత్తు, శ్రీ మద్భవద్గీత 5వ అధ్యాయంలపై ప్రవచనాలు చేస్తారని అన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో గీత జ్ఞాన యజ్ఞంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్, తెలంగాణ సీనియర్ సిటీజన్స్ జిల్లా నాయకులు నల్ల సత్యనారాయణ, చేపూరి బుచ్చయ్య, కటుకం సత్తయ్య, చేపూరి నాగరాజు, మేర్గు మల్లేశం, జిందం రమేష్, కమలాకర్, దయాకర్, అనందం, శంకర్ పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు స్పందన

సిరిసిల్ల టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం నేతాజీ డిగ్రీ కళాశాలలో టెక్ బ్రిక్స్ ఐటీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు యువతీ, యువకుల నుంచి స్పందన వచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణత పొందిన యువతి, యువకులు దాదాపు 100 మంది జాబ్ మేళాలో పాల్గొనగా 10 మంది ఎంపికయ్యారు. ఎంపికైన యువతీ, యువకులకు కళాశాల చైర్మన్ పృథ్విధర్‌రావు, ప్రిన్సిపల్ రేకం శ్రీకాంత్ నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఈనెల 20వ తేదిన జాబ్‌లో జాయిన్ అవనున్నారు. జాబ్ మేళకు సహకరించిన కళాశాల యాజమానానికి టెక్‌బ్రిక్స్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులు డాకం విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యాం, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులపై లాఠీచార్జి హేయమైన చర్య

సిరిసిల్ల టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జీ చేయించడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ పక్షాణ ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుంటూ ఆ ప్రాంతంలోని 11 గ్రామాల రైతులు, ప్రజలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పరిశ్రమకు సంబంధించిన యాజమాన్యం పనులను ఆపకపోవడంతో అడ్డుకున్న రైతులను, ప్రజలను పోలీసులు లాఠీచార్జీ చేయడం సరికాదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని ఆపి ఆ ప్రాంత ప్రజలు, రైతుల ఆరోగ్యాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వడ్లూరి సాయికుమార్, ఎస్కే అఫ్రోజ్, కాసర్ల వినయ్, అజ్జు, గాజుల రమేష్, సంతోష్, భానుకిరణ్, శ్రీనివాస్‌రావు, సలీం పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి...

**- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా**



కలెక్టరేట్ ఎదుట విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందిస్తున్న కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసే కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మధ్యాహ్న భోజన సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సీఐటీయూ మధాహ్న భోజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తరలివచ్చిన కార్మికులు ధర్నాచేసి విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందించి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను ఇప్పించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కార్మికులు పద్మ, వనజ, వసంత, నర్సవ్వ, రాధ తదితరులు పాల్గొన్నారు.